సాక్షి రంగారెడ్డి
గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



వాణిజ్య పంటలకు పెద్దపీట

రైతు సంక్షేమం.. వారిని అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. 8లో▸



మాస్టర్‌ప్లాన్‌కు అడుగులు

కడ్తాల్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం టీపీఓ అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. 8లో▸



అక్రమ నిర్మాణాల సీజ్

కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను పెద్దఅంబర్‌పేట మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజు



షాద్‌నగర్: సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న కమిషనర్ అజయ్‌కుమార్

ఆమనగల్లు: విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్) డాక్టర్ రాజు అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. అంతకుముందు నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవనాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మహిళల కోసం త్వరలోనే గైనకాలజిస్ట్‌ను నియమించనున్నట్లు స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పరీక్షిత్ నరేందర్, నాగరాజు, మైమూనా, సిబ్బంది ఏసుమణి, అలివేలు, జ్యోతి, సంపూర్ణ, మునీర, ఇందిర, దేవేందర్, వేణు ఉన్నారు.

షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో..

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని బుధవారం రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. వైద్యం కోసం వచ్చిన రోగులతో మాట్లాడారు. అనంతరం ఆసుపత్రిలోని ల్యాబ్‌ను పరిశీలించారు. రోగులకు ఎలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు..? మందుల నిల్వలు, సిబ్బంది హాజరు గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డిని అడిగి వివరాలు సేకరించారు.

మోహన్‌బాబు ఇంట్లో చోరీ

నిందితుడి అరెస్టు



గణేశ్ నాయక్

పహాడీషరీఫ్: సినీ నటుడు మంచు మోహన్‌బాబు ఇంట్లో చోరీ జరిగిన సంఘటన పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ గురువారెడ్డి తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి శివారులో మోహన్‌బాబుకు నివాసం (మంచు టౌన్‌షిప్) ఉంది. ఇంటి ఆవరణలోనే వ్యక్తిగత కార్యదర్శులు, సెక్యూరిటీ సిబ్బంది, పనివారి కోసం వేర్వేరు గదులున్నాయి. ఈ నెల 22న మోహన్‌బాబు ఆదేశాల మేరకు పర్సనల్ సెక్రటరీ (పీఎస్) కిరణ్‌కుమార్ తిరుపతి లోని ఎంబీయూ యూనివర్సిటీ నుంచి రూ.10 లక్షల నగదు తీసుకొని రాత్రికి మంచు టౌన్‌షిప్‌నకు చేరుకున్నాడు. రాత్రి కావడంతో ఉదయాన్నే డబ్బులు మోహన్‌బాబుకు ఇద్దామని తన గదిలో ఉంచాడు. ఈ టౌన్‌షిప్‌లోనే అనంతపురం జిల్లా నల్లమాడ మండలం ఎర్రవంకపల్లి గ్రామానికి చెందిన గణేశ్ నాయక్ (24) హౌజ్ బాయ్‌గా పని చేస్తున్నాడు. కిరణ్ డబ్బు లు తెచ్చిన విషయం ముందే తెలుసుకున్న గణేశ్ అతడు నిద్రపోయాక డబ్బుతో పరారయ్యాడు. ఉదయాన్నే లేచి చూడగా డబ్బుతో పాటు గణేష్ కనిపించలేదు. సీసీ కెమెరాలు పరిశీలించగా అతడే డబ్బు తీసుకెళ్లినట్లు నిర్ధారణ అయ్యింది. మోహన్‌బాబు సూచన మేరకు కిరణ్ 23న పహాడీషరీఫ్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు సూచనలతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు తిరుపతిలో ఉన్నట్లు గుర్తించి ప్రత్యేక బృందాన్ని అక్కడికి పంపి బుధవారం స్టేషన్‌కు తీసుకొచ్చారు. రూ.7,36,400ల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

జంట జలాశయాలకు భారీగా వరద

సాక్షి, సిటీబ్యూరో: జంట జలాశయాలకు భారీస్థాయిలో వరద చేరుతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్లు నిండుకుండగా మారాయి. ఉస్మాన్‌సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరడంతో మంగళవారం రాత్రి రెండు గేట్లు ఒక అడుగు మేర ఎత్తి దిగువన నీటిని కిందికి విడుదల చేశారు. హిమాయత్‌సాగర్ జలాశయానికి సైతం వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టానికి దగ్గరలో ఉంది. దీంతో బుధవారం సాయంత్రం రిజర్వాయర్ ఒక గేటు ఒక అడుగు మేర ఎత్తారు. ఈ నేపథ్యంలో దిగువ ప్రాంతాల ప్రజలను జలమండలి అప్రమత్తం చేసింది.

ఆపరేషన్ మూసీ

ప్రక్షాళనకు సర్వే షురూ!

- నిర్వాసితులకు పునరావాసం
- గండిపేట, కుత్బుల్లాపూర్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు
- జిల్లాలో 332 మంది ఉన్నట్లు ప్రాథమిక అంచనా
- బాధితులకు నచ్చజెప్పే పనిలో అధికారులు



అధికారులతో సమావేశమైన కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మూసీ సుందరీకరణ, అభివృద్ధికి ముందడుగు పడింది. ఇప్పటికే అధికార యంత్రాంగం నదికి ఇరువైపులా వెలసిన అక్రమ నిర్మాణాలు, నిర్వాసితులను గుర్తించే పనిలో నిమగ్నమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ శశాంక రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, గండిపేట రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, పోలీసు, సర్వే విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లో పుట్టిన మూసీ.. జిల్లాలోని హిమాయత్ సాగర్, ఉస్మాన్‌సాగర్‌ల నుంచి రాజేంద్రనగర్, అత్తాపూర్, నయాపూల్, అఫ్జల్‌గంజ్, చాదర్‌ఘాట్, అంబర్‌పేట్, రామంతాపూర్, నాగోలు, ఉప్పల్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మీదుగా యాదాద్రి భువనగిరి జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఈ మూసీ పరివాహక ప్రాంతానికి రెండు వైపులా భారీగా అక్రమ నిర్మాణాలు వెలిసిన విషయం విదితమే. కొంత మంది ఏకంగా నది గర్భంలోకి చొచ్చుకెళ్లి నిర్మాణాలు చేపట్టారు. వర్షాకాలంలో భారీ వరదలకు నది ఉప్పొంగి ప్రమాదకర పరిస్థితి తలెత్తుతోంది. ఈ నదికి పూర్వ వైభవం తీసుకురావాలనే ఆలోచనతో ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది.

జిల్లాలో 332 నిర్మాణాలు

గ్రేటర్ జిల్లాల పరిధిలో ఈ నదికి ఇరువైపులా 12,184 అక్రమ నిర్మాణాలున్నట్లు అధికారులు ఇప్పటికే గుర్తించారు. వీటిలో జిల్లా పరిధిలోని గండిపేట మండలంలో 32 నిర్మాణాలు, రాజేంద్రనగర్ మండలంలో 300పైగా నిర్మాణాలు వెలిసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. హైడ్రా పేరిట ఓఆర్‌ఆర్‌కు లోపల ఉన్న చెరువులు, కుంటలు, బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్‌లలో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మూసీ పరివాహక ప్రాంతాల్లోని నిర్మాణాలను సైతం తొలగించేందుకు రంగం సిద్ధం చేయడం.. ఆ మేరకు అక్రమ నిర్మాణాలు, నిర్వాసితుల గుర్తింపునకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇదే అంశంపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో కలెక్టర్ శశాంక రాజేంద్రనగర్ మండల అధికారి కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమై.. ఆక్రమణల తొలగింపు, నిర్వాసితులకు పునరావాసం కల్పన తదితర అంశాలపై చర్చించారు. బాధితులకు నచ్చజెప్పి, వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించేందుకు పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, సర్వే, ఇరిగేషన్ విభాగాల్లోని ఎనిమిది నుంచి పది మంది అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం.. ఆ మేరకు ఆయా బృందాలు రంగంలోకి దిగి ఖాళీ చేయించే పనిలో నిమగ్నమయ్యాయి. నిర్వాసితులకు గండిపేట, కుత్బుల్లాపూర్‌లలో ప్రభుత్వం సిద్ధం చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించే అంశాన్ని సైతం అధికార యంత్రాంగం పరిశీలిస్తోంది.

నచ్చజెప్పి.. ఖాళీ చేయించండి: కలెక్టర్ శశాంక

మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు చేపట్టినందున పరివాహక ప్రాంతంలోని అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించేందుకు వివరాలు సేకరించాలని.. వారికి భరోసా కల్పించేలా అధికారులు నచ్చజెప్పాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని నివాసాలు, కమర్షియల్ ఆక్రమణలు ఏ మేరకు ఉన్నాయో వివరాలు సేకరించాలన్నారు. ఎంపిక చేసిన బృందాలు తొలుత క్షేత్రస్థాయిలో పర్యటించి, ఇక్కడ నివసించడం శ్రేయస్కరం కాదని వివరించాలని చెప్పారు. నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తుందని చెప్పాలని సూచించారు. ఇంటి యజమానికి సంబంధించిన ఆధార్ కార్డు, ఇంటికి సంబంధించి పేపర్లు, కరెంట్ బిల్స్, అనుమతులు తదితర డాటాను సేకరించాలన్నారు. ఇప్పుడు ఉంటున్న ఇళ్లకు వరదల ముప్పు ఉంటుందని, ఎప్పటికైనా నివాసాలకు అనువుగా ఉండదని వారికి తెలియజేయాలన్నారు. వీరికి కేటాయించే డబుల్ ఇళ్లకు సంబంధించి వారి చేతనే డ్రా తీయిస్తుందని.. ఖాళీ చేసేందుకు రవాణా ఖర్చు సైతం ప్రభుత్వమే భరిస్తుందని చెప్పాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, మూసీ రివర్ డెవలప్‌మెంట్ అథారిటీ జాయింట్ ఎండీ గౌతమి, డీసీపీ శ్రీనివాస్, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, రాజేంద్రనగర్ మున్సిపల్ కమిషనర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయిస్తున్న అధికారులు

షాద్‌నగర్‌లో హైడ్రా

- అడ్డుకోవాలని ఎమ్మెల్యేపై ఒత్తిడి
- నీటి ప్రవాహానికి అడ్డుగా నిర్మించిన ప్రహరీ కూల్చివేత
- వీర్లపల్లి తీరుపై రైతుల హర్షం

షాద్‌నగర్: చెరువు నీరు నిండి అలుగు ద్వారా ప్రవహిస్తున్న నీటికి అడ్డంగా ఓ వ్యక్తి ప్రహరీ నిర్మించాడు.. దీంతో కొన్నేళ్లుగా చుట్టుపక్కల వ్యవసాయ పొలాలు నీటితో నిండిపోతున్నాయి. ఫలితంగా పంట నష్టం వాటిల్లుతోంది. దీంతో హైడ్రా తరహాలో అధికారులు అడుగులు ముందుకు వేసి నీటి ప్రవాహానికి అడ్డుగా నిర్మించిన ప్రహరీ కూల్చివేతలు మంగళవారం ప్రారంభించి బుధవారం పూర్తి చేశారు. ఈ ఘటన షాద్‌నగర్ పరిధిలోని లింగారెడ్డిగూడ శివారులో చోటు చేసుకుంది.

నీటి ప్రవాహానికి అడ్డుగా గోడ నిర్మాణం

షాద్‌నగర్ పరిధిలోని లింగారెడ్డిగూడ శివారులో వీరమోని చెరువు ఉంది. ఈ చెరువు నిండితే అలుగు ద్వార పాత జాతీయ రహదారి బ్రిడ్జి కింద నుంచి నీరు గురుకుంటకు చేరుతుంది. పాత జాతీయ రహదారి పక్కన నీటి ప్రవాహానికి అడ్డంగా వ్యవసాయ పొలం చుట్టూ ఓ వ్యక్తి సిమెంట్ పలకలతో ప్రహరీ నిర్మించాడు. దీంతో చెరువు నిండినప్పుడు నీరు కిందకు వెళ్లకుండా చుట్టు ప్రక్కల వ్యవసాయ పొలాల్లోకి చేరుతోంది. ఫలితంగా పంటలు నీటి పాలవుతున్నాయి.

ఎమ్మెల్యేకు మాజీ ఎమ్మెల్యేల ఫిర్యాదు

నీటి ప్రవాహానికి అడ్డంగా నిర్మించిన ప్రహరీని తొలగించాలని, రైతుల పంట పొలాలను కాపాడాలని కోరుతూ ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు బక్కని నర్సింలు, భీష్మ కిష్టయ్యతోపాటుగా పలువురు గ్రామస్తులు ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నీటి ప్రవాహానికి అడ్డంగా నిర్మించిన గోడను పరిశీలించారు. నీటి వనరులకు ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కాగా ప్రహరీ నిర్మించిన సదరు వ్యక్తి తొలగింపును అడ్డుకునేందుకు శతవిధాలా ప్రయత్నించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై విపరీతంగా ఒత్తిడి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే వేటికి తలొగ్గకుండా ముందడుగు వేశారు. సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేయొద్దని అధికారులకు సూచించారు. దీంతో ముంపు సమస్యతో ఇబ్బంది పడుతున్న రైతులు ఎమ్మెల్యే తీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హైడ్రా తరహా అడుగులు

నీటి ప్రవాహానికి అడ్డంగా నిర్మించిన గోడను తొలగించేందుకు అధికారులు హైడ్రా తరహాలో చర్యలు చేపట్టారు. ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పోలీసుల సహకారంతో నీటి ప్రవాహానికి అడ్డంగా గోడను జేసీబీ, హిటాచీ సాయంతో తొలగించారు.

ఉపేక్షించేది లేదు



సహజనీటి వనరులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది. చెరువులు, కుంటలు, కాల్వలు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు. ఒత్తిళ్లకు తలొగ్గం.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్



యువజనోత్సవాలకు ముస్తాబవుతున్న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం

యువజనోత్సవాలకు వేళాయె.!

- 29 వరకు పేర్ల నమోదుకు అవకాశం
- 30న జిల్లాస్థాయి కళాకారుల ఎంపిక
- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో పది కేటగిరీల్లో పోటీలు

హుడాకాంప్లెక్స్: మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని, బస్తీల్లోని యువ కళాకారులను గుర్తించి వారిని మరింత ప్రోత్సహించేందుకు జిల్లా యువజన, క్రీడలశాఖ కసరత్తు చేస్తోంది. 28వ జాతీయ యువజనోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 30న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో 15 నుంచి 29 ఏళ్లలోపు యువ కళాకారులను ఎంపిక చేయనుంది. జానపద సంగీతం, జానపద నృత్యం, కథ రచన, పెయింటింగ్, వకృత్వం, కవిత్వం, యువక్రితి, సైన్స్‌మేళా వంటి అంశాల్లో బృంద, వ్యక్తిగత పోటీలకు అభ్యర్థులను ఎంపిక చేయనుంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ ఎంపిక ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన వారు, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అవుతారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. అభ్యర్థులు తమ ఆధార్, ఫోన్ నంబర్, ప్రదర్శన పేరు, తదితర వివరాలను ఈ నెల 29లోగా 989909077 నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాల్సి ఉంటుందని జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు.

జానపద నృత్యం(బృందం)

పది మంది సభ్యులకు మించరాదు. ప్రదర్శన నిడివి 15 నిమిషాలు మించరాదు. బాల, బాలికలు ఉండొచ్చు. వాయిద్య పరికరాలను ప్రదర్శన ఇచ్చేవారే సమకూర్చుకోవాలి. లైవ్ ప్రదర్శన చేసిన వారికి ఎంపికలో ప్రాధ్యానత ఉంటుంది.

జానపద నృత్యం(సింగిల్)

ఒక బృందంలో అందరూ కలిపి ఐదుగురిని అనుమతిస్తారు. జానపద నృత్యాలు భారత సంప్రదాయానికి అనుగుణంగా ఉండాలి. ప్రదర్శనకు గరిష్టకాల పరిమితి ఏడు నిమిషాలు. గ్రూపులో బాలబాలికలు పాల్గొనొచ్చు.

జానపద సంగీతం

ఇందులో ఐదుగురు సభ్యులకు మించరాదు. ప్రదర్శన భారత సంప్రదాయానికి అనుగుణంగా ఉండాలి. సినిమా పాటలు అనుమతించరు. గతంలో లైవ్ ప్రదర్శన చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుంది.

కవిత్వం

ఒక్కొక్కరు ఒక రచనను మాత్రమే సమర్పించాలి. 500 పదాలకు మించరాదు. 60 నిమిషాల్లో పూర్తి చేయాలి. ఒకసారి ఎంపిక చేసిన అంశాన్ని మరోసారి మార్చుకునేందుకు వీలు లేదు.

వ్యాసరచన

ఎంపిక చేసిన అంశంపై ఇంగ్లిష్‌లో 60 నిమిషాల్లో రాయాల్సి ఉంటుంది. ఎంపిక చేసిన అంశాన్ని ఆ తర్వాత మార్చుకునేందుకు వీలుండదు.

పెయింటింగ్

గరిష్టకాల పరిమితి 90 నిమిషాలు. ఎ–3 సైజు పేపర్‌పై మాత్రమే పెయింటింగ్ వేయాలి. పేపర్ సహా ఇతర సామగ్రిని అభ్యర్థులే సమకూర్చుకోవాలి.

ఉపన్యాసం

ఎంపిక చేసిన అంశంపై హిందీ/ఆంగ్లంలో మూడు నిమిషాలకు మించకుండా మాట్లాడాలి.

యువక్రితి

యువతీ, యువకులకు దేశంలోని వివిధ ప్రాంతాల హస్తకళలను అర్థం చేసుకునేందుకు, అభినందించేందుకు ప్రత్యేక అవకాశం కల్పిస్తోంది. దేశ వ్యాప్తంగా ఉన్న యువతతో నేరుగా ముఖాముఖి కోసం వేదికను అందిస్తుంది. హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల కేటగిరిలో గరిష్ఠంగా ఇద్దరిని ఎంపిక చేయబడుతుంది.

సైన్స్‌మేళా

యువత, సైన్స్ అండ్ టెక్నాలజీ తయారు చేసిన కొత్త ప్రాజెక్టుల ప్రదర్శనను తీసుకుని రావాలి. డ్యామ్స్, సోలార్ సిస్టం, వంటి ప్రాజెక్టులు వ్యక్తిగతంగా/ గ్రూపుగా పాల్గొనే అవకాశం కల్పిస్తారు.

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు సరికాదు

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

మొయినాబాద్ రూరల్: అమెరికాలో పర్యటిస్తున్న రాహుల్‌గాంధీ భారతదేశంలో రిజర్వేషన్లు తొలగిస్తామనడం సరికాదని బీజేపీ రాష్ట్ర నాయకుడు, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేఎస్ రత్నం మాట్లాడుతూ.. అంబేడ్కర్ దేశ సుపరిపాలన కోసమే రాజ్యాంగం రూపొందించి రిజర్వేషన్లను రూపొందించారన్నారు. రిజర్వేషన్ల మూలానే దేశం అభివృద్ధిలో ముందడుగు వేస్తోందన్నారు. అన్ని కులాలను కలుపుతూ ప్రధాని మోదీ అభివృద్ధికి కృషి చేస్తుంటే.. పరాయి దేశంలో పర్యటిస్తున్న రాహుల్‌గాంధీ మాటలు విచారకరమన్నారు. రాహుల్‌గాంధీ వాఖ్యలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కుల గణన పేరిట ఎనిమిది నెలలుగా స్థానిక సంస్థలకు ఎన్నికలు పెట్టకపోవడం ప్రభుత్వం పనితీరు తెలిసిపోతోందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, రాష్ట్ర నాయకులు అంబేడ్కర్, ప్రతాప్, రమేశ్, పురుషోత్తం, సత్యానారాయణ, రవి, వెంకటేశ్, శోభ, చిట్టి, దయాకర్, భిక్షపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మా పేర్లు చెప్పొద్దు.. ప్లీజ్

- ఔషధనగరి భూ సేకరణలో అక్రమార్కుల చేతివాటం
- మధ్యవర్తుల సహకారంతో కోట్ల రూపాయలు కొల్లగొట్టినట్టు అధికారులపై ఆరోపణలు
- గ్రామాల్లో వివరాలు సేకరించిన ఇంటెలిజెన్స్, సీఐడీ అధికారులు
- పరారీలో మధ్యవర్తులు..?



యాచారం తహసీల్దార్ కార్యాలయం

యాచారం: అక్రమార్కుల్లో గుండెల్లో గుబులు పుట్టింది. బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'ఫార్మాపై నజర్' అనే కథనం ఆ నాలుగు గ్రామాల్లో ప్రకంపణలు సృష్టించింది. భూసేకరణతో దండిగా దండుకున్న అధికారులు మధ్యవర్తులకు ఫోన్లు చేసి తమ పేర్లు బయటకు రాకుండా చూడాలని బ్రతిమాలుడుతున్నట్లు తెలుస్తోంది. ఫార్మాసిటీకి యాచారం మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో 7,640 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను సేకరించారు. 2017 నుంచి భూసేకరణ ప్రారంభమైంది. మొదట్లో అసైన్డ్ పట్టాదారులకు ఎకరాకు రూ.8 లక్షలు, ప్రభుత్వ భూముల్లో కబ్జాలో ఉన్న రైతులకు ఎకరాకు రూ.7.70 లక్షలు, పట్టా భూములకు ఎకరాకు రూ.12.50 లక్షల పరిహారం అందజేశారు. మొదట్లో అసైన్డ్‌దారులకు పరిహారం చెల్లింపు విషయంలో సాగు యోగ్యంగా ఉన్న భూమికే పరిహారం(ఒక రైతుకు పట్టాదారు, పాసుపుస్తకంలో మూడు ఎకరాలుంటే, అందులో సాగుకు యోగ్యంగా ఉన్న రెండు ఎకరాలకే) చెల్లించారు. రైతులు చేసేదేమీ లేక మిన్నుకుండిపోయారు. పట్టా భూములకు ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున చెల్లించారు. 2017 నుంచి భూసేకరణ చేసిన రైతులకు పరిహారం చెల్లింపులు జరిగినా అక్రమాలు, అవకతవకలు జరగలేదు. భూసేకరణ అధికారులు 2020 నుంచి అసైన్డ్ దారుల వద్ద సాగుకు యోగ్యం లేని భూమికి సంబంధించిన పరిహారం మొత్తం అక్రమార్కుల పేరిట మంజూరు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

మధ్యవర్తులు చెప్పిన పేరిట చెక్కులు

ఫార్మాసిటీ భూసేకరణలో రూ.500 కోట్లకు పైగానే అక్రమాలు జరిగినట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. 2020 నుంచి 2023 మధ్యనే పెద్ద ఎత్తున అక్రమార్కులకు పరిహారం అందినట్లు ఇంటెలిజెన్స్ , సీఐడీ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఈ నాలుగు గ్రామాల్లో వ్యవసాయ భూములు లేని.. కనీస పరిచయాలు లేని నల్గొండ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన అక్రమార్కుల పేర్ల మీద లక్షల రూపాయల్లో పరిహారం మంజూరు చేసినట్లు గ్రామాల్లో పుకార్లు పుట్టుకొస్తున్నాయి. నాలుగు గ్రామాల్లో దాదాపు పది నుంచి 20 మందికి పైగా మధ్యవర్తులను ఏర్పాటు చేసుకున్న భూసేకరణ అధికారులు వారు ఏ పేర్లు చెబితే వారి పేరిట పరిహారం చెక్కులు మంజూరు చేసేవారని భూములు కోల్పోయిన రైతులు ఆరోపిస్తున్నారు. ఓ భూసేకరణ అధికారి ఆదేశిస్తే యాచారం తహసీల్దార్ కార్యాలయం నుంచి రిపోర్టు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయం గంటల్లోనే చేరుతుంది. మరుసటి రోజు అక్రమార్కులకు పరిహారం చెక్కు అందేదని రైతులు వాపోతున్నారు. మంజూరైన పరిహారంలో వాటాలు వేసుకునే వారని వెల్లడిస్తున్నారు. అక్రమార్కులకు పరిహారం చెక్కులు ఇస్తే వారు బ్యాంకుల్లో జమ చేసిన వెంటనే అదే బ్యాంకు నుంచే భూసేకరణ అధికారులు బ్యాంకు ఖాతాలు, లేదా వారి కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లో డబ్బును బదిలీ చేసేవారని రైతులు చెబుతున్న విషయం. భూసేకరణ అధికారులతో పాటు మధ్యవర్తులు సైతం రూ.కోట్లల్లో అక్రమంగా సంపాదిచినట్లు సమాచారం.

సీఎం దృష్టికి 'సాక్షి' కథనం

'సాక్షి'లో ప్రచురితమైన ఫార్మాపై నజర్ అనే కథనాన్ని కాంగ్రెస్ సర్కార్‌లోని ఓ సీనియర్ నేత బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ కథనంపై ఇంటెలిజెన్స్. సీఐడీ అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి భూములు లేని రైతులకు ఎవరికైనా పరిహారం అందిందా? మధ్యవర్తులెవరు? ఏ భూసేకరణ అధికారి హయాంలో అక్రమంగా పరిహారం అందింది? ఎకరాకు ఎంత లంచం ఇచ్చేవారు? లంచాన్ని ఏ రూపంలో(చెక్కులా, డబ్బులా) బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారా? లేదా నేరుగా అధికారులకు ఇచ్చేవారా? లేక అధికారులకే ఇచ్చేవారా అంటూ ఆరా తీశారు. ఇంటెలిజెన్స్, సీఐడీ అధికారుల ఆరాతో నాలుగు గ్రామాల్లోని మధ్యవర్తులు గ్రామాలు వదిలి పారిపోయినట్లు తెలిసింది. ఇదే విషయమై ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డిని 'సాక్షి' సంప్రదించగా ఫార్మాసిటీ భూసేకరణలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై విచారణ చేస్తున్న విషయం తెలిసిందన్నారు.


సాక్షి
'ఫార్మా'పై నజర్

వేతనం ఇవ్వడం లేదని మనస్తాపం

పురుగు మందు తాగి వీఓఏ ఆత్మహత్యాయత్నం



మహబూబ్‌నగర్‌లో చికిత్సపొందుతున్న స్వప్న

కొందుర్గు: తనకు వేతనం ఇవ్వలేదని ఓ వీఓఏ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాగారం గ్రామానికి చెందిన స్వప్న రెండేళ్లుగా వీఓఏగా విధులు నిర్వర్తిస్తోంది. గతంలో ఇదే గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి వీఓఏగా పనిచేశారు. అతను విధులకు హాజరు కాకపోవడంతో ఐకేపీ సిబ్బంది స్వప్నతో పని చేయించుకున్నారు. కానీ వీఓఏ బాధ్యతలు రాజు పేరునే ఉండటంతో ఆమెకు వేతనం ఇవ్వలేదు. ఈ విషయమై మంగళవారం ఏపీడీ సూర్యారావుకు వినతిపత్రం అందించగా.. పేరు మార్పిడి కానందున మీకు వేతనం ఇవ్వడం కుదరదని స్వప్నకు తెలియజేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె బుధవారం ఇంట్లో ఉన్న పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం స్వప్న ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా రాజు అనే వ్యక్తి ప్రస్తుతం బాకారం పంచాయతీ కారోబార్‌గా, ఉపాధి హామీ మేట్‌గా పనిచేస్తున్నాడని స్థానికులు తెలిపారు. ఒకే వ్యక్తికి మూడు రకాల బాధ్యతలు ఎలా అప్పగిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి బాధితురాలు స్వప్నకు న్యాయం చేయాలని కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బల్దియా కార్మికురాలి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్: ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గుంతపల్లి గ్రామానికి చెందిన బరిగెల రాములమ్మ(61) జీహెచ్‌ఎంసీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తున్నారు. కాగా బుధవారం ఆమె విధులు ముగించుకొని గ్రామానికి వెళ్లేందుకు మధ్యాహ్నం 2గంటలకు అబ్దుల్లాపూర్‌మెట్ కూడలిలోని షాడో ఆస్పత్రి సమీపంలో ఉంది. అదే సమయంలో వచ్చిన హయత్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి ఆమెను ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాములమ్మ కాళ్లు పూర్తిగా విరిగిపోవడంతో పాటు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ఎల్‌బీనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా.. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తూరులో కార్డన్ సెర్చ్



షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నందిగామ: కొత్తూరులో బుధవారం రాత్రి పోలీసులు కార్డన్ సెర్చ్ చేపట్టారు. శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో పట్టణంలోని కిరాణాషాపులు, పాన్ షాపులు, దాబాలు, లాడ్జీలలో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని షాపులలో నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బెల్టు షాపులలో మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారని గుర్తించి వారిపైన కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ తనిఖీలలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, నలుగురు ఎస్సైలు, 70 మంది సిబ్బంది పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్ కోసం వివరాల సేకరణ

కడ్తాల్‌లో సమావేశమైన టౌన్ ప్లానింగ్ అధికారులు



మాస్టర్ ప్లాన్ తయారీపై వివరాలు సేకరిస్తున్న డీటీసీపీ ఏడీ సత్యభామ తదితరులు

కడ్తాల్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం టౌన్ ప్లానింగ్ ఏడీ సత్యభామ, టౌన్‌ప్లానింగ్ అధికారి సువర్ణ ఆధ్వర్యంలో కడ్తాల్ పూర్వపు రెవెన్యూ పంచాయతీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కడ్తాల్ పూర్వపు రెవెన్యూ పరిధిలోని గ్రామ పంచాయతీలను కలిపి మండల కేంద్రాన్ని అభివృద్ధి చేయడానికి ఇండికేటివ్ ల్యాండ్ యూస్ ప్లాన్(ఐఎల్‌యూపీ) ముసాయిదా తయారీపై సమీక్షించారు. పూర్వపు రెవెన్యూ పంచాయతీ పరిధిని అన్ని విధాలుగా అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో, మాస్టర్ ప్లాన్‌లో మార్పులు, చేర్పులపై వారు చర్చించారు. పూర్వపు రెవెన్యూ పరిధిలో చెరువులు, కుంటలు, రహదారులు, ప్రభుత్వ భూములకు సంబంధించి వాటి సమగ్ర సమచారాన్ని సేకరించడం కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, జాతీయ రహదారిపై ఇరువైపులా చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు, రహదారులతో పాటు, ట్రాఫిక్‌కు అనుగుణంగా నివాస, వాణిజ్య, ఇండస్ట్రీయల్ తదితర వాటిని ప్రజల ఉపయోగార్థం మాస్టర్ ప్లాన్ ద్వారా అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారు.



కడ్తాల్: ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో అధికారులతో కలిసి మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



షాబాద్: నాగర్‌గూడ శ్రీకృష్ణ ఆలయ ఆవరణలో ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మధుసూదన్‌రెడ్డి తదితరులు

వాణిజ్య పంటలకు పెద్దపీట

- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ ప్రారంభోత్సవం

కడ్తాల్: రైతు సంక్షేమం.. వారిని అన్ని విధాలుగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చల్లంపల్లిలో రైతు శేఖర్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఉద్యానశాఖ, సెరికల్చర్ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ మెగాప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో వంట నూనెల వినియోగం పెరగడంతో విదేశాల నుంచి పామాయిల్ దిగుమతి చేసుకుంటున్నామని.. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు ప్రోత్సాహానికి చర్యలు చేపట్టిందన్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకే వాణిజ్య పంటల సాగుకు సర్కార్ పెద్దపీట వేస్తోందన్నారు. ఆయిల్ పామ్ తోటలో అంతరపంటల సాగుకు అవకాశం ఉంటుందన్నారు. మొక్క నాటిన నాలుగో ఏడాది నుంచే ఉత్పత్తి మొదలై 30 ఏళ్ల వరకు ఆదాయం పొందవచ్చన్నారు.

90శాతం రాయితీపై మొక్కలు

అనంతరం జిల్లా ఉద్యానశాఖ అధికారి సురేశ్ మాట్లాడుతూ.. నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు ఆర్జించవచ్చన్నారు. ఎకరాకు ఎనిమిది నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవడంతో పాటుగా కోతులు, అడవి పందులు, పక్షులు, దొంగల బెడద ఉండదన్నారు. ఈ పంట సాగు చేసే రైతులకు 90శాతం రాయితీపై మొక్కలు, డ్రిప్‌నకు 80 నుంచి వంద శాతం వరకు సబ్సిడీ వస్తుందని చెప్పారు. నాలుగేళ్ల వరకు ఎకరాకు రూ.4,200 చొప్పున రైతు ఖాతాలో జమచేస్తుందన్నారు. మార్కెటింగ్‌కు దిగులు చెందాల్సిన అవసరం లేదన్నారు. వాల్యూ ఆయిల్ కంపెనీ కొనుగోలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీహెచ్ కిషన్‌రావు, తహసీల్దార్ ముంతాజ్, ఏడీఏ ఆదిలక్ష్మి , ఎంపీడీఓ సుజాత, వాల్యూ ఆయిల్ కంపెనీ ఎండీ రామకృష్ణ, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా నాయకులు సురేందర్‌రెడ్డి, హన్మానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్లు వెంకటేశ్, డాక్టర్ శ్రీను, గుర్క మల్లేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, మాజీ సర్పంచ్‌లు విఠలయ్యగౌడ్, నరేందర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మహేందర్‌రెడ్డి, పర్వతాలు, రాములుగౌడ్, నాయకులు తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్, అశోక్, నరేశ్, రాజేందర్, మండల ఉద్యాన అధికారి సౌమ్య, ఏఓ శ్రీలత, ఫీల్డ్ అధికారి హిమకుమార్ రైతులు తదితరులు ఉన్నారు.

1,161 ఎకరాల్లో సాగు

కేశంపేట: ఆయిల్‌పామ్ సాగుకు చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని దీంతో అధిక లాభాలు ఆర్జించవచ్చునని జిల్లా ఉద్యానశాఖ అధికారి సురేశ్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని నిర్దవెల్లిలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 1,161 ఎకరాల్లో ఆయిల్ పంటను సాగులోకి తెచ్చామన్నారు. మెగా ప్లాంటేషన్ సందర్భంగా 18 మండలాల్లోని 52 గ్రామాల్లో 96 మంది రైతుల భూముల్లో 17,328 మొక్కలు నాటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి హిమబిందు, ఫీల్డ్ అధికారి రుక్మిణి, కిష్టయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1,160కు 57 మొక్కలు

షాబాద్: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చునని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోతుగల్ శివారు శ్రీకృష్ణ ఆలయ వర్డలో రైతు తాళ్ల శ్రీనివాస్‌గౌడ్ వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగామన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుకు ఎకరాకు రూ.1,160 డీడీ చెల్లిస్తే కంపెనీ నుంచి 57 మొక్కలు అందజేస్తారన్నారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం రాయితీ, బీసీ, ఓసీ రైతులకు 90శాతం సబ్సిడీ వస్తుందన్నారు. ఆయిల్‌పాం కంపెనీ ఎండీ రఘు, సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. తమ కంపెనీ ద్వారా నాణమైన మొక్కలను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అందజేస్తామన్నారు. మండలాల వారీగా ఫీల్డ్ స్టాఫ్ రైతులకు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల ఏడీఓ సురేష్‌బాబు, ఎంపీడీఓ అపర్ణ, హార్టికల్చర్ అధికారి కీర్తన, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, సీనియర్ నాయకుడు వసంతం, ఎంపీటీసీ మాజీ సభ్యులు చెన్నయ్య, అశోక్, వెంకట్‌రెడ్డి, మల్లేశ్, మాజీ సర్పంచ్‌లు జనార్దన్ రెడ్డి, ఖాజామీయా, నర్సింహులు, కృష్ణగౌడ్, రవీందర్‌నాయక్, శేఖర్‌రెడ్డి, నరేందర్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లబ్ధి పొందాలి

కందుకూరు: ప్రభుత్వ సహకారంతో ఆయిల్‌పామ్ సాగు చేపట్టి రైతులు లబ్ధి పొందాలని ఉద్యానశాఖ ఏడీహెచ్ కిషన్‌రావు రైతులకు సూచించారు. ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్‌లో భాగంగా బుధవారం మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేటలో రైతు బి.సుధాకర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏడీహెచ్ మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని ప్రయోజనం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరిత, మండల ఉద్యాన శాఖ అధికారి సౌమ్య, ఏపీఓ రవీందర్‌రెడ్డి, ఏఈఓ రాఘవేంద్రాచారి, ఫీల్డ్ అధికారి మల్లేశ్, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో లాభాలు



ఇబ్రహీంపట్నం రూరల్: కప్పపహాడ్‌లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆయిల్‌పాం సాగు రైతుకు లాభసాటిగా ఉంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కప్పపహాడ్ గ్రామంలో రైతు కందాడ తిరుమల్‌రెడ్డి పొలంలో ఆయిల్‌పాం మెగా ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రంగారెడ్డి మొక్కలు నాటి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాటకు కట్టుబడి ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఆయిల్‌పాం సాగుపై ఉన్న సబ్సిడీలను రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నర్సింహారావు, ఉద్యానవన శాఖ అధికారి నవీన, వ్యవసాయ శాఖ ఏడీఏ సూజాత, ఎంపీడీఓ వెంటకమ్మ, ఏఈఓ శ్రవణ్ కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై అసభ్య ప్రవర్తన.. జంటపై కేసు

పహాడీషరీఫ్: నడిరోడ్డుపై నలుగురు చూస్తున్నారన్న ధ్యాస కూడా లేకుండా బైక్‌పై వెళ్తున్న ఓ జంట అసభ్యంగా వ్యవహరించిన ఘటనపై బాలాపూర్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధిచిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పబ్లిక్ న్యూసెన్స్ కింద కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాలలో వారి ముఖాలు, బైక్ నంబర్ కూడా నమోదు కాలేదని.. మరిన్ని కెమెరాలను కూడా పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

నందిగామ: విద్యుదాఘాతానికి గురై ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన నందిగామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన అబ్దుల్(40) నందిగామ శివారులోని నూజివీడు పారిశ్రామిక వాడ ఎదురుగా ఉన్న షెడ్డులో వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అతడు కిందపడిపోయాడు. దీంతో తోటి కార్మికులు, నిర్వాహకులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ విషయమై ఇప్పటి వరకు తమకు ఫిర్యాదు అందలేదని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

అక్రమ నిర్మాణాల సీజ్



కుంట్లూర్‌లో నిర్మిస్తున్న ఇళ్లను సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్: కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి నిర్మించిన అక్రమ కట్టడాలను పెద్దఅంబర్‌పేట మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. కుంట్లూర్ పరిధిలోని సర్వేనంబర్ 143లోని స్థల వివాదం కోర్టు పరిధిలో ఉండగా, సదరు సర్వేనంబర్‌లో ఎలాంటి నిర్మాణాలను చేపట్టకూడదని ఆదేశాలున్నాయి. అయినా అవేమీ పట్టించుకోకుండా నిర్మించిన ఐదు ఇళ్లను బుధవారం కమిషనర్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది సీజ్ చేసింది.

బస్సు నుంచి పడి మహిళ మృతి

ఆమనగల్లు: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సులో నుంచి పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఆమనగల్లు పట్టణ సమీపంలోని షాద్‌నగర్ రోడ్డులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామానికి చెందిన కడారి పెద్ద యాదమ్మ(55) పని నిమిత్తం ఆమనగల్లు పట్టణానికి వచ్చింది. తిరిగి సాయంత్రం చుక్కాపూర్ వెళ్లడానికి పట్టణంలోని బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కి కండెక్టర్ సీటు పక్కన నిలబడింది. ఆమనగల్లు నుంచి షాద్‌నగర్ రోడ్డులో వెళుతున్న బస్సు గుంతలపై నుంచి వెళ్లడంతో ఆమె వద్ద ఉన్న సంచులో సామగ్రి పడటంతో వాటిని తీసుకుంటుంది. ఈ క్రమంలో మూలమలుపు వద్ద ఒక్కసారిగా మల్లడంతో బస్సులో నుంచి ఆమె కింద పడింది. తీవ్రగాయాల పాలైన యాదమ్మను వెంటనే చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించగా మార్గమధ్యలో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

మద్యం తరలిస్తుండగా పట్టివేత

కొందుర్గు: నిబంధనలకు విరుద్ధంగా ఓ వైన్‌షాపు యాజమాన్యం మద్యం బాటిళ్లను ఆటోలో వేసుకొని పరిసర గ్రామాల్లోని బెల్ట్‌షాపులకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి వివరాల ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్‌లోని ఓ వైన్‌షాపు యాజమాన్యం బుధవారం ఆటోలో మద్యం కాటన్‌లు నింపుకొని మండలంలోని ఇంద్రానగర్, గుర్రంపల్లి, రావిర్యాల, కాస్లాబాద్, పీర్జాపూర్ తదితర గ్రామాల్లోని బెల్ట్‌షాపులకు సరఫరా చేస్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో చౌదరిగూడ పోలీసులు వాహనాన్ని పట్టుకొని 3 కాటన్‌ల బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

బైక్ దొంగల అరెస్ట్

లంగర్‌హౌస్: చెడు వ్యసనాలకు బానిసై డబ్బు కోసం బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు మైనర్‌లను బుధవారం లంగర్‌హౌస్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ రఘుకుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నార్సింగి ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలలు వ్యసనాలకు అలవాటుపడ్డారు. ఇందుకు అవసరమైన డబ్బుల కోసం వివిధ ప్రాంతాల్లో పార్క్ చేసిన బైక్‌లను చోరీ చేసేవారు. నార్సింగి పరిధిలో మూడు, లంగర్‌హౌస్ పరిధిలో ఒక బైక్‌ను దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ కేఎస్ ప్రసాద్ వర్మ ఆధ్వర్యంలో ఎస్ఐ కవియుద్దీన్ పలు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించిన వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు అంగీకరించడంతో వారిని లంగర్‌హౌస్ పోలీసులకు అప్పగించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై చర్యలకు వినతి



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం: దివ్యాంగుడిపై దురుసుగా ప్రవర్తించి, అవహేళన చేసిన ఇబ్రహీంపట్నం డిపో ఆర్టీసీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఎం వెంకట నర్సప్పకు వినతిపత్రం అందించారు. అనంతరం జంగయ్య మాట్లాడుతూ.. ఐకేపీ ఏపీఎం రవీందర్ గత మంగళవారం సాయంత్రం ఐదున్నర గంటల ప్రాంతంలో ఇబ్రహీంపట్నం వెళ్లేందుకు చాదర్ ఘాట్ వద్ద నిరీక్షిస్తున్నాడని తెలిపారు. ఈ సమయంలో ఎంజీబీఎస్ నుంచి ఇబ్రహీంపట్నంకు వెళ్తున్న (277) బస్సును రవీందర్ ఆపాడన్నారు. కానీ డ్రైవర్ బస్సును ఆపకుండా నెమ్మదిగా వెళ్లాడన్నారు. తంటాలు పడుతూ బస్ ఎక్కిన రవీందర్‌ను డ్రైవర్ అవహేళన చేస్తూ మాట్లాడాడని తెలిపారు. వైకల్యాన్ని ఎత్తి చూపుతూ అవమానపర్చిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో వారే కూర్చునే విధంగా సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలని డీఎంకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు చిట్టి రాజు, యాచారం జంగయ్యతో, మిద్దెల బాలరాజ్, గువ్వల యాదయ్య, ఆకుల సంజీవ, కందుకూరి నాగరాజు, ఎండీ సలీం , చెరుకూరి భానుప్రసాద్ ఉన్నారు.

ఆపరేషన్ చేస్తే.. చూపు పోయింది

ప్రైవేటు ఆస్పత్రి ఎదుట బాధితుడి ఆందోళన



ఆస్పత్రి ఎదుట బైఠాయించిన బాధితుడు రాములు

షాద్‌నగర్ రూరల్: వైద్యుల నిర్లక్ష్యంతో శాశ్వతంగా కంటి చూపు కోల్పోయానని బుధవారం సాయంత్రం షాద్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ఎదుట బాధితుడు ఆందోళన చేపట్టాడు. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం చిన్నరేవల్లికి చెందిన రాములుకు కంటి చూపు మందగించింది. దీంతో గత జులైలో గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుడిని సంప్రదించాడు. అతడి సూచన మేరకు షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వచ్చాడు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు కంటిలో పొర వచ్చిందని ఆపరేషన్ చేశారు. అనంతరం ఇంటికి పంపించారు. శస్త్రచికిత్స తర్వాత కన్నుకు వాపు రావడంతో పాటు, విపరీతంగా నొప్పి ఉండటంతో కుటుంబ సభ్యులు అతడిని ఆస్పత్రికి తీసుకొచ్చారు. దీంతో సదరు ఆస్పత్రి నిర్వాహకులు రాములను హైదరాబాద్‌కు తీసుకెళ్లి మరో ప్రైవేటు ఆస్పత్రిలో మరో ఆపరేషన్ చేయించి ఇంటికి పంపించారు. నెలలు గడిచినా వాపు తగ్గకపోవడం, కంటి చూపు పూర్తిగా మందగించడంతో కుటుంబ సభ్యులు రెండు రోజుల క్రితం బాధితుడిని హైదరాబాద్‌లోని సరోజిని దేవి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు రాములుకు చేసిన ఆపరేషన్లు విఫలమై శాశ్వతంగా కంటి చూపు కోల్పోయాడని తెలిపారు. దీంతో బాధితుడు, కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రి ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ విషయమై వైద్యులను అడిగేందుకు ప్రయత్నించగా ఆస్పత్రిలో బాధ్యులెవరూ అందుబాటులో లేరు.

వేంకటేశ్వరుడి సేవలో సంగీత దర్శకుడు



వేంకటేశ్వర ఆలయంలో ఆర్‌పీ పట్నాయక్ దంపతులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్తుండగా మార్గ మధ్యలో ఫరూఖ్‌నగర్‌లోని పాత జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని ఆర్‌పీ పట్నాయక్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్థల పురాణం గురించి మున్సిపల్ కౌన్సిలర్ సభ్యుడు ఒగ్గు కిషోర్ సంగీత దర్శకుడి దంపతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సాయీశ్వర్‌రెడ్డి, భూపాల్, అర్చకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

7.795 కిలోల గంజాయి స్వాధీనం

సాక్షి, సిటీ బ్యూరో: గ్రేటర్ పరిధిలోని రామచంద్రాపురం, కూకట్‌పల్లి రోడ్ సిటీ సర్కిళ్ల పరిధిలో ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు బుధవారం 7.795 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్టీఎఫ్ డీఎస్పీ తిరుపతి యాదవ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశా, మల్కాన్‌గిరి ప్రాంతానికి చెందిన కిషోర్ దాస్ అనే వ్యక్తి నగరంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. అతను అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి 6.715 కేజీల గంజాయి, రూ. 7100 నగదు స్వాధీనం చేసుకున్నారు. దూల్‌పేట్ జాలి హనుమాన్ ప్రాంతానికి చెందిన గణేష్ సింగ్, ఉమేష్ సింగ్ కూకట్‌పల్లిలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచాం అందడంతో దాడి చేసిన పోలీసులు అతడి నుంచి 1.080 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గణేష్ సింగ్‌ను అరెస్టు చేయగా ఉమేష్ సింగ్ పరారీలో ఉన్నాడన్నారు. వారి నుంచి రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని పట్టుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి అభినందించారు.